క్లుప్తంగా

ఆర్టీసీ సేవలు వినియోగించుకోండి

కుల్కచర్ల: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముజాహిద్‌పూర్ ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ చంద్రయ్య అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో గ్రామస్తులకు ఆర్టీసీ అందిస్తున్న సేవల గురించి వివరించారు. సంస్థ సేవలు మరింత విస్తరించాలన్న లక్ష్యంతో కార్గో, అడ్వాన్స్ బుకింగ్, ఆధ్యాత్మిక ప్రాంతాలకు, వివాహాలకు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక పాఠశాల చైర్మన్ నర్సింహులు, భాస్కర్, భీమయ్య పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఎంఈఓ

దౌల్తాబాద్: బాలంపేట, మాటూరు, అంతారం పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి వెంకటయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు త్వరలో దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బషీరాబాద్‌లో 37,112 ఓటర్లు

బషీరాబాద్: సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులు ఓటర్ల లెక్కలు తేల్చుతున్నారు. మండలంలో 11,156 నివాసాలు ఉండగా.. 10,735 ఇళ్లలో సర్వే పూర్తి చేశారు. ఈ సర్వేలో చనిపోయిన ఓటర్లను, వలస ఓటర్లను ఏరివేయగా.. 37,112 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ వెంకట స్వామి తెలిపారు. వీరిలో మహిళలు 19,199, పురుషులు 17,913 ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలో 1,119 మందిని డబుల్ ఓటర్లుగా గుర్తించి వారి పేర్లను తొలగించారు. మండలంలో మొత్తం 47 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా.. ఈ సారి దామర్‌చెడ్‌లో మరో పీఎస్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవాబుపేట: ముదిరాజ్ నవాబుపేట మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తెలుగు రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా విజయ్ కుమార్, కార్యదర్శులుగా శ్రీకాంత్, రాజు, ప్రభు, నారాయణ, కోశాధికారిగా గోపాల కృష్ణ, రమేష్, సోషల్‌మీడియా సభ్యులుగా శ్రీహరి, సాయి, చంద్రశేఖర్, సలహాదారులుగా మాణెయ్య, మధు, అంజయ్య, రఘులను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

దౌల్తాబాద్: చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలని ఎస్‌బీఐ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ సూచించారు. ఎస్‌బీఐ హైదరాబాద్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలకు కంప్యూటర్‌తో పాటు విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగుతూ.. ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఊషన్న, మాజీ వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంత్, రిటైర్డ్ హెచ్‌ఎంలు మాధవరెడ్డి, వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం

యాలాల: మైనార్టీల పాలిట దేవుడు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న నాయకుడు రోహిత్‌రెడ్డి అని, అలాంటి వ్యక్తిపై కొందరూ మైనార్టీ నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సెక్యులర్ నాయకుడు అని చాటి చెప్పడానికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు వచ్చిన బీజేపీ నాయకులను పట్టించిన సంఘటన చాలన్నారు. 40 ఏళ్లలో కనబడని మైనార్టీల అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించిన నాయకుడన్నారు. నియోజకవర్గంలో ఈద్గాలు, శ్మశానవాటికలు, మైనార్టీల భవనాల కోసం రూ.కోట్లు కేటాయించారని, ప్రస్తుతం అవన్నీ అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్న మైనార్టీ నేతల బండారం త్వరలో బయటపెడతామని హెచ్చరించారు.

సర్పంచ్‌కు పరామర్శ

యాలాల: సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, అగ్గనూరు సర్పంచ్ భీమప్ప కుటుంబ సభ్యులను మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం భీమప్ప తల్లి చంద్రమ్మ(75)మృతి చెందగా.. విషయం తెలుసుకున్న సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలు వేర్వేరుగా భీమప్ప కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ అనంతయ్య ఉన్నారు.

జాడలేని ఎరువుల తయారీ!

వర్మి కంపోస్టుల షెడ్లు అలంకార ప్రాయంగా మారాయి. దీంతో రసాయనిక ఎరువులు వద్దు.. సహజ సిద్ధమైన ఎరువులతో సాగును ప్రోత్సహిద్దామనుకున్న సర్కారు లక్ష్యం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నీరుగారి పోయింది. ఫలితంగా జీపీలకు వచ్చే ఆదాయం సంగతి ఎలా ఉన్నా.. షెడ్ల కోసం వెచ్చించిన నిధులు వృథా అయ్యాయి.



పెద్దేముల్ మండలం మారేపల్లి కంపోస్టు షెడ్

పెద్దేముల్: చెత్త లేక, ఎరువుల తయారీ కాక వర్మి కంపోస్టు షెడ్‌లు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి వాటితో జీపీలకు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు పెట్టి ప్రతి గ్రామ పంచాయతీల్లో షెడ్లు నిర్మించింది. వాటిని వినియోగంలోకి తేవడంలో మండల అధికారులు నిర్లక్ష్యం చేయగా.. అవి వృథాగా మారినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్దేముల్ మండలం 37 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 37 వర్మి కంపోస్టు షెడ్లను మంజూరు చేసింది. ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.2లక్షలకు పైగా నిధులు కేటాయించి, సర్పంచ్‌లకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ షెడ్లను లక్ష్యంగా నిర్మించారు. తడి–పొడి చెత్తను సేకరించి షెడ్లకు వచ్చిన తరువాత ప్లాస్టిక్, సీసాలతో పాటు ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావటం లేదు. వ్యర్థ పదార్థాలు, కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. దానికి పంచాయతీ అధికారులే పూర్తి బాధ్యత వహించాలి. సేంద్రియ ఎరువు తయారైన తరువాత స్థానిక రైతులకు విక్రయించాలి. ఆదాయం సమకూర్చుకోవాలి. ఇదే విషయమై మండల అధికారులు, పంచాయతీ కార్యాదర్శులకు క్షేత్రస్థాయి సమావేశాల్లో కలెక్టర్లు, డీపీఓలు సూచించారు. అయినప్పటికీ ఎరువుల తయారీ ప్రక్రియ మండలంలో ఎక్కడా కానరావటం లేదు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడటం వల్లే వర్మి కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయని గ్రామస్తులు బహిరంగంగా చెబుతున్నారు.

పేరుకే తడి–పొడి

పంచాయతీల్లో తడి–పొడి చెత్త ఎక్కడా కనబడటం లేదు. చెత్త సేకరణకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ట్రాక్టర్లను జీపీలకు సమకూర్చింది. అయితే జీపీ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నారు.. కానీ ఎక్కడో గుంతల్లో పోసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో కంపోస్టు షెడ్లు గ్రామానికి అలంకార ప్రాయంగా మిగిలాయని స్థానికులు చెప్పారు. ఇంటింటికీ తిరిగి, వీధుల్లో సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి ఉపయోగిస్తే రైతులకు ఉపయోగంతో పాటు.. గ్రామానికి ఆదాయం సమకూరేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

నిరుపయోగంగా వర్మి కంపోస్టు షెడ్లు

- సేకరించిన చెత్త పెంటపాలు
- జీపీ కార్యదర్శుల నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వాన పాములు ఎక్కడా?

ఏడాది క్రితం సేంద్రియ ఎరువుల తయారీకి ప్రభుత్వం.. ఒక్కో పంచాయతీకి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు చేసి వాన పాములను పంపిణీ చేసింది. వాటిని జీపీ కార్యదర్శులు కంపోస్టు షెడ్లలో చెత్త–చెదారం వేసి అందులో వాన పాములు వేయాలి. రెండు రోజులకు ఒకసారి పర్యవేక్షించి, ఎరువుల తయారీ ప్రక్రియను వేగిరం చేయాల్సి ఉంటుంది. కానీ వాటి పట్టించుకునే వారు లేక షెడ్‌లు వృథాగా మారుతున్నాయని స్థానికంగా చెబుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం



వర్మి కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకొస్తాం. అవసరం అయితే పంచాయతీ కార్మికులకు శిక్షణ ఇస్తాం. ప్రభుత్వ పథకాలను అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు గ్రామ ప్రజల సహకారం ముఖ్యం. తడి–పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసేలా జీపీ కార్యదర్శులకు సలహాలు, సూచనలు చేస్తాం.

– లక్ష్మయ్య, ఎంపీడీఓ, పెద్దేముల్

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం



రక్తం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదని, ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అని డిపో మేనేజర్ సమత అన్నారు. ఆర్టీసీ డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. టీసీ శేఖర్, శోభ, శ్యాం సుందర్‌రెడ్డి, నందులాల్ పాల్గొన్నారు.

పరిగి డిపోలో..

పరిగి: రక్తదానం చేసిన వారు ప్రాణదాతలు అవుతారని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ పవిత్ర అన్నారు. పరిగి ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. సంస్థ కార్మికులు, ఇతరులు 30మంది రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. అత్యవసర సమయంలో రక్తం దొరకక ఎంతో మంది చనిపోతున్నారని, రక్తాన్ని ముందుగానే సేకరించి, భద్రపరచి అత్యవసరం సమయంలో ఉపయోగించేందుకు ఈ శిబిరాలు తోడ్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అనంతగిరి చిన్న జాతర

ఏడు రోజులు కొనసాగనున్న ఉత్సవం



పద్మనాభ స్వామి ఆలయం ప్రధాన ద్వారం

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న అనంతగిరి గుట్టలో వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా చిన్న జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. యేటా రెండు సార్లు ఉత్సవాలు ఉండగా.. ఆషాఢ మాసంలో 7 రోజుల పాటు చిన్న జాతర, కార్తిక మాసంలో 16రోజుల పాటు పెద్ద జాతర జరుగుతుంది. ఆషాఢశుద్ధ దశమిన ప్రారంభమై, పౌర్ణమిన ఉత్సవాలు ముగుస్తాయి. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహనంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. 29న గురువారం ఏకాదశి చాతుర్మాస్య ఆరంభం అవుతుంది. జులై 3న పెరుగుబసంతం ఉత్సవాల్లో భాగంగా పౌర్ణమి నాడు మధ్యాహ్నం 2.30 గంటలకు గరుడ వాహన సేవ ఊరేగింపు అనంతరం పెరుగు బసంతం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ జాతరకు వికారాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట్, బీదర్, తాండూర్, కొడంగల్, షాద్‌నగర్, సంగారెడ్డి, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

అనంతగిరి కొండలు..

అనంతగిరి ఆలయం ద్వాపర యుగం నాటిదని, ఆలయానికి సుమారు 5వేల సంవత్సరాల చరిత్ర ఉందని పూర్వికులు చెప్పారు. ఆలయం సుమారు 1300 వందల ఏళ్లనాటి దని చరిత్ర ద్వారా తెలుస్తోంది. అనంతగిరి కొండలు సముద్ర మట్టానికి 3,600 అడుగుల ఎత్తులో ఉన్నాయి. దేవాలయం సమీపంలో ఉన్న భగీరథ పుష్కరిణిలో స్నానం ఆచరిస్తే పాపాలు తొలగి పోతాయని భక్తుల విశ్వాసం. భక్తుల కోరికలు నెరవేరడం, ఆయురారోగ్యాలు, సంతాన ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఉంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం తెలిపారు.

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా?



బాగాయిపల్లి-కమాల్‌పూర్ రోడ్డును పరిశీలిస్తున్న సునీతారెడ్డి

యాలాల: అధ్వానంగా మారిన రోడ్లలో ప్రమాదాలు జరిగితే కానీ స్పందించరా అని ఆర్‌అండ్‌బీ అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం తాండూరు నుంచి తిరుగు ప్రయాణంలో ఆమె కోకట్–బాగాయిపల్లి మీదుగా వెళ్లారు. ఈ క్రమంలో కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు గుంతల మయంగా మారిన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరిగే మార్గంలో.. కోతకు గురైన రోడ్లకు ఇరువైపులా కనీసం గ్రావెల్ ఎందుకు వేయలేదన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్‌చేసి కోతకు గురై, గుంతలు ఏర్పడిన రోడ్లను మరమ్మతు చేయించాలని ఆదేశించారు.

భవన కార్మికులకు శిక్షణ తరగతులు

పరిగి: భవన కార్మికుల కోసం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పద్మమ్మ అన్నారు. మంగళవారం నస్కల్ గ్రామంలో జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారిచే శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. లేబర్ కార్డు ఉన్న వారికి 15రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, మొదటి విడతలో 60 మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. శిక్షణ తీసుకుంటున్న కార్మికులకు మధ్యాహ్నం ఉచితంగా భోజనం, రోజుకు రూ.300 చొప్పుల స్కాలర్‌షిప్ అందిస్తున్నారని చెప్పారు. ఆసక్తి ఉన్న కార్మికులు మరో విడతకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్, రైతుబంధు కోఆర్డినేటర్ రాజేందర్, ట్రైనింగ్ ఇన్‌చార్జి ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుకు శ్రద్ధ చూపాలి

బొంరాస్‌పేట: జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. తహసీల్దారు కార్యాలయం ఎదుట లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నిర్వహిస్తున్న నిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ మాట్లాడారు. కళాశాల విద్య కోసం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాలేజీ ఏర్పాటు చేసే వరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో జూనియర్ కళాశాల జాడ లేదని, విద్యా సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు శ్రద్ధ చూపాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు బాగా చదవండి

మండల విద్యాధికారి చంద్రప్ప



మాలసోమారంలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ

బంట్వారం: విద్యార్థులు పాఠ్య పుస్తకాలను ధారాళంగా చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. పఠనోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన బంట్వారం, మాలసోమారం, ఎన్నారం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడారు. నిత్యం పిల్లలతో పాఠాలు చదివించాలని, ఇంటి వద్ద పుస్తక పఠనం చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. మూడు రోజులు ఆంగ్లం, మరో మూడు రోజులు తెలుగు పఠనం చేయించాలన్నారు. పాఠశాలల్లోని మినీ గ్రంథాలయాల్లో రోజుకు ఒక పీరియడ్ కేటాయించి చదివించాలన్నారు. ఈ నెల 31 వరకు పఠనోత్సవం ఉంటుందని, విద్యార్థుల పఠనంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాంచంద్రయ్య, సరిత, ఉపాధ్యాయులు బందెయ్య, సుదర్శన్, జ్యోతి, లావణ్య, సీఆర్‌పీ నర్సింహులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మెడికల్ కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి

కుల్కచర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్, సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడారు. వానాకాలంలో ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండి, దోమలు, ఈగలు వ్యాప్తిచెందుతాయని చెప్పారు. సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, రోగాల బారిన పడకుండా చూడాలని పేర్కొన్నారు. ఎవరైనా విరేచనాలు తదితర ఇబ్బందులకు గురైతే.. వెంటనే ప్రాథమిక చికిత్స చేసేందుకు అవసరమైన వైద్యపరికరాలను ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు అందజేశారు. వైద్యులు మాధురి, ప్రశాంతి, సిబ్బంది విజయలక్ష్మి, మల్లేశ్, యాదమ్మ, సుజాత, రత్నమ్మ, వెంకటమ్మ, జంగమ్మ, భారతమ్మ, జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు బ్యాగ్స్, నోట్ బుక్స్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు

కుల్కచర్ల: విద్యార్థుల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్‌లు అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం భజ్యానాయక్ తండా గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నారులకు విద్యాపరంగా సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయుడు శ్రీశైలం, ప్రధానోపాధ్యాయుడు మంగ్యానాయక్, ఉపాధ్యాయుడు శివరాం, ఎంపీటీసీ సంగీత, ఎంఈఓ హబీబ్ అహ్మద్, చౌడాపూర్ జెడ్పీ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తిమ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్



కళాజాతలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

మర్పల్లి: పోలీస్ శాఖ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో చట్టాలపై కళాజాత బృందంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. విద్యార్థులు అపరిచితులతో మాట్లావద్దని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే 100, 1098 డయల్ చేయాలని, లేదంటే స్థానిక పోలీసుల ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతకు ముందు బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, మూఢ నమ్మకాలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణకుమార్, అధ్యాపకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పొదుపు చేయడం నేర్చుకోవాలి

ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్



దోమ: అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

దోమ: ఇప్పటి నుంచే విద్యార్థులు డబ్బును పొదుపు చేయడం నేర్చుకోవాలని ఎస్‌బీఐ దోమ మేనేజర్ (నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, మొదటి స్థానంలో ఐనాపూర్ పాఠశాలకు చెందిన రవితేజ, మోసిన్ టాపర్‌గా నిలిచారు. రెండో స్థానంలో గుండాల పాఠశాలకు చెందిన నక్క రోజ, కౌసల్య నిలవగా, మూడో స్థానంలో మోత్కూర్ పాఠశాల సింధూజ, భానుప్రియ నిలిచారు. వీరికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పురందాస్ ప్రశంసాపత్రాలతో పాటు నగదు అందజేశారు.

నగదు ప్రోత్సాహం

యాలాల: ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి స్థానంలో జెడ్పీహెచ్ఎస్ బెన్నూరు, రెండో స్థానంలో కేజీబీవీ, మూడో స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ రాస్నం పాఠశాల విద్యార్థులు నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలకు రూ.5వేలు, ద్వితీయంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో ఉన్నవారికి రూ.3వేల చొప్పున నగదును మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి అందజేశారు.

పప్పు దినుసుల సాగును పెంచండి

విత్తన పంపిణీ కార్యక్రమంలో నాయకులు, అధికారులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు రమేశ్

మర్పల్లి: ప్రభుత్వం సరఫరా చేసిన కంది, మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని, పప్పు దినుసుల సాగును పెంచాలని బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు బట్టు రమేష్ కోరారు. మర్పల్లి మండలం సిరిపురం రైతు క్లస్టర్ వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం కింద ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాలను 100 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొంత మంది రైతులు వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతూ.. పప్పు దినుసులు వేయడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పప్పు దినుసుల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ.. పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఏఈఓ మహేశ్ మాట్లాడుతూ 75 మంది రైతులకు కంది విత్తనాల మినీ కిట్స్, 26 మంది రైతులకు మినుము బస్తాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిరిపురం రైతుబంధు గ్రామ కమిటీ కోఆర్డినేటర్ రఘురాంరెడ్డి, వీర్లపల్లి రైతు బంధు కోఆర్డినేటర్ సుక్కారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విత్తనాలతో అధిక దిగుబడులు

పరిగి: ఉచిత విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. మంగళవారం పరిగి మండలం రంగాపూర్, సయ్యద్‌పల్లి రైతువేదికలో రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా పూర్తి రాయితీపై 4కిలోల కంది విత్తనాల ప్యాకెట్లను అందజేసి మాట్లాడారు. రైతులకు పీఆర్‌జీ 176, ఎల్‌ఆర్‌జీ 52 కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఎంపిక చేసిన రైతులకు అందిస్తున్నామని, మండల వ్యాప్తంగా 26క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయని, ఆయా ప్రాంతాల రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కావున అర్హులైన అన్నదాతలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

మోమిన్‌పేట: ఈ దారిలో ప్రయాణించే వాహనదారులు ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదం బారిన పడక తప్పదని కల్వర్టు పక్కనే ఏర్పడిన గొయ్యిలు చూస్తే తెలుస్తోంది. కల్వర్టు నిర్మించిన నిర్మాణదారులు.. బీటీ వేయకుండా వదిలేశారు. దీంతో వర్షాలు పడి మొరం కొట్టుకుపోయి పెద్దగా గోతులు ఏర్పడి నోళ్లు తెరిచి ఉన్నాయి. మోమిన్‌పేట మండలం మోమిన్ పేట నుంచి శంకర్‌పల్లి వెళ్లే రహదారిలో మంగళికుంట వాగుపై నిర్మించిన కల్వర్టు, ఏన్కతల గ్రామం వెనుక, ముందు రెండు కల్వర్టులు, దేవరంపల్లి వద్ద ఒక కల్వర్టు, చీమల్‌దరి వద్ద మరో కల్వర్టు ఇలా మొత్తం ఐదు నిర్మించి నాగుగేళ్లు గడిచింది. అయినా బీటీ వేయలేదు. వర్షాలు కురుస్తుండటంతో మట్టి కొట్టుకుపోయి వంతెన పక్కన లోయలు ఏర్పడి.. ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మోమిన్‌పేట దేవరంపల్లి వద్ద మట్టి కొట్టుకుపోయి లోయగా మారిన కల్వర్టు ప్రదేశం